

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 233 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం, 23, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# స్కూళ్లు ఉన్నాయి.. పిల్లలే లేరు!



రాష్ట్రంలో 996 ప్రభుత్వ పాఠశాలల్లో 40 మందిలోపే విద్యార్థులు

16 పాఠశాలల్లో ఒక్క విద్యార్థితోనే కొనసాగుతున్న బోధన

తక్కువ నమోదు ఉన్న స్కూళ్లపై క్షేత్రస్థాయి తనిఖీలకు విద్యాశాఖ ఆదేశాలు

ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు స్కూళ్లలోనే అధిక విద్యార్థుల నమోదు

విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను వెల్లడించిన తాజా గణాంకాలు

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆందోళనకరంగా తగ్గుతున్నట్లు తాజా విద్యాశాఖ గణాంకాలు వెల్లడించాయి. 2025--26 విద్యా సంవత్సరంలో 996 ప్రభుత్వ పాఠశాలల్లో 40 మందిలోపే విద్యార్థులు ఉండగా, 16 పాఠశాలలు కేవలం ఒక్క విద్యార్థితోనే కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితి ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నమోదవుతున్న మార్పులకు అద్దం పడుతోందని అధికారులు భావిస్తున్నారు. విద్యార్థుల వాస్తవ నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల కంటే తక్కువ సంఖ్యలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లోనే ఎక్కువ మంది విద్యార్థులు చేరడం ప్రభుత్వ విద్యపై ప్రజల మారుతున్న అభిరుచిని సూచిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చర్యలు అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


- అమరావతి (జై భీమ్ డెస్క్)

2



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



## నీట్ పరీక్షలపై.. దేశవ్యాప్తంగా ఆందోళన

పరీక్షల పారదర్శకతపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన

విద్యా సంస్కరణల కోసం సోనం వాంగ్చుక్ నిరాహార దీక్ష

జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల శాంతియుత సంఘీభావ నిరసనలు

నిష్పాక్షిక దర్యాప్తు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

నీట్‌పై ప్రజల విశ్వాసం నిలబెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి

3



## వరంగల్ పశ్చిమకు భట్టి వరం..

రెండు 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు

ఎమ్మెల్యే నాయిని విజ్ఞప్తికి వెంటనే స్పందించిన ఉప ముఖ్యమంత్రి

బాలసముద్రం, కేయూ వద్ద కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు




4

## హనుమకొండలో ‘ఛాత్రోంకి గూంజ్’ కార్యక్రమం

విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం

మంత్రి పొన్నం ప్రభాకర్

3



## విలాసాల ఇంజనీర్..!

### అక్రమార్జనే ధ్యేయంగా అడ్డదారులు..!

రూ.28 కోట్ల అక్రమాస్తులపై ఏసీబీ ఉచ్చు

రెడ్కో డివిజనల్ ఇంజనీర్ ముత్యం వెంకట రమణపై ఌ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

భార్య పేరుతో నాలుగు నిర్మాణ సంస్థలు.. రూ.20 కోట్లతో 10 అపార్ట్‌మెంట్ల నిర్మాణం


2019లో లంచం కేసులో పట్టుబడిన అధికారిపైనే మరోసారి ఏసీబీ దాడులు

ఎనిమిది చోట్ల సోదాలు.. కోట్ల విలువైన భవనాలు, ఫ్లాట్లు, బంగారం, బ్యాంకు నిల్వలు, వాహనాలు స్వాధీనం

2

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# గత 12 ఏళ్లుగా దేశంలో మతతత్వ రాజకీయాలు ప్రబలుతున్నాయి




**దొడ్డబళ్లాపుర (కర్ణాటక ) జై భీమ్ న్యూస్ :**

76 ఏళ్ల చరిత్ర కలిగిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారత రాజ్యాంగ ఆకాంక్షల ప్రకారం తమకు చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డిమాండ్ చేసింది. అలాగే భీమా సంఘటన మహా కూటమి, రాజ్యాంగ పరిరక్షణ పౌర వేదిక ఆర్ ఎస్ ఎస్ అనుసరిస్తున్న రాజకీయాలను వ్యతిరేకించింది. బెంగళూరు గ్రామీణ జిల్లాలోని దొడ్డబళ్లాపూర్‌లో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో భీమా సంఘటన మహా కూటమి రాష్ట్ర అధ్యక్షుడు కె. మరియప్ప మాట్లాడుతూ, దేవుడు, మతం పేరిట నడుస్తున్న నీచమైన రాజకీయ వ్యవస్థ కారణంగా దేశ ప్రజల మనసుల్లో మిశ్రమ భావాలు నెలకొన్నాయని, ఎన్డీఏ నియంతృత్వ పాలనను ప్రదర్శిస్తోందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నీడలో బీజేపీ సాగిస్తున్న దుష్పరిపాలనపై దేశ ప్రజలు నిరంతరం ఆందోళనకు గురి అవుతున్నారని 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఆర్‌ఎస్‌ఎస్, రాజ్యాంగబద్ధంగా సంఘాన్ని నమోదు చేయాలన్న కర్ణాటక రాష్ట్ర హోం మంత్రి ప్రియాంక ఖర్గే డిమాండ్ తప్పుగా మారిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక సామరస్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కన్నాల్లి కృష్ణప్ప మాట్లాడుతూ, స్వాతంత్ర్యం పొందడానికి రక్తపు చుక్క కూడా చిందించకుండా బ్రిటిష్ వారికి దూరంగా ఉన్న సంఘ్ పరివార్ సభ్యులు దేశంలో మళ్లీ మనుధర్మాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. సంఘ్ పరివార్ సభ్యుల మతతత్వ రాజకీయాలు దేశ ప్రజలలో ఆందోళనను సృష్టించాయని ఆయన తెలిపారు. అందువల్ల ఈ విజ్ఞప్తిని తీవ్రంగా పరిగణించి, బూటకపు దేశభక్తి గల రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ యొక్క రాజ్యాంగ ఆకాంక్ష ప్రకారం చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ, మతతత్వ రాజకీయాలను వ్యతిరేకిస్తూ తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌డి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణప్ప, పివిసి స్వాభిమాన రాష్ట్ర అధ్యక్షుడు మునిఅంజనప్ప, కె.ఆర్.ఎస్. రాష్ట్ర అధ్యక్షుడు బెళతూరు వెంకటేష్, దళిత క్రియ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కదుగుడి సొన్నప్ప,ఎం. గంగన్న, చంద్ర తేజస్, రాజు, ఎస్.ఎం. మారి, పి.ఎ. వెంకటేష్, హనుమన్న, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండలో ‘ఛాత్రోంకి గూంజ్’ కార్యక్రమం

**విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం**
**మంత్రి పొన్నం ప్రభాకర్**

**హనుమకొండ, 22 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థులకు నాణ్యమైన విద్య, పారదర్శక పరీక్షా విధానం, సమాన అవకాశాలు కల్పించడం కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని, అయితే ఆ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. హనుమకొండ జిల్లా కిషన్‌పురలో నిర్వహించిన ‘ఛాత్రోంకి గూంజ్’ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి, దేశవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల రద్దులు, మళ్లీ పరీక్షల నిర్వహణ వంటి ఘటనలు లక్షలాది మంది విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, చివరకు ప్రశ్నాపత్రాల లీకులతో వారి శ్రమ వృథా కావడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్--యూజీ పరీక్ష రద్దుతో దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర అనిశ్చితి నెలకొందని, పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలు పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశాయని పేర్కొన్నారు. ఈ పరిణామాల కారణంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు దేశాన్ని కలచివేశాయని అన్నారు. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన మంత్రి, ప్రశ్నాపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జీలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీకి నిరసనగా కాంగ్రెస్ అగ్రనేతలు నిర్వహించిన శాంతియుత నిరసనను అడ్డుకుని వారిని అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. పార్లమెంట్‌లో పరీక్షల లీకేజీల అంశంపై చర్చకు కేంద్రం ముందుకు రాకపోవడం ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతోందని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం కూడా విద్యార్థి ఉద్యమాల నుంచే ప్రారంభమైందని గుర్తు చేసిన మంత్రి, దేశ భవిష్యత్తును మార్చే శక్తి యువత చేతుల్లోనే ఉందన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ‘ఛాత్రోంకి గూంజ్’ కార్యక్రమాల్లో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. యువత ప్రతిభకు విలువ దక్కేలా పారదర్శకమైన, నిష్పక్షపాతమైన, భద్రమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన మంత్రి, ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, అయూబ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, యువజన ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్కూళ్లు ఉన్నాయి... పిల్లలే లేరు!

**రాష్ట్రంలో 996 ప్రభుత్వ పాఠశాలల్లో 40 మందిలోపే విద్యార్థులు**
**16 పాఠశాలల్లో ఒక్క విద్యార్థితోనే బోధన**

**అమరావతి (జై భీమ్ డెస్క్)**

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆందోళనకరంగా తగ్గిపోతున్నట్లు విద్యాశాఖ గణాంకాలు వెల్లడించాయి. 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన సమగ్ర పాఠశాల విద్య సమాచార వ్యవస్థ గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని 996 ప్రభుత్వ పాఠశాలల్లో 40 మందిలోపే విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో 16 పాఠశాలల్లో కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే ఉండడం గమనార్హం. గణాంకాల ప్రకారం ఒకటి నుంచి పది మంది విద్యార్థులతో 171 పాఠశాలలు, 11 నుంచి 20 మంది విద్యార్థులతో 237 పాఠశాలలు, 21 నుంచి 30 మంది విద్యార్థులతో 297 పాఠశాలలు, 31 నుంచి 39 మంది విద్యార్థులతో 291 పాఠశాలలు కొనసాగుతున్నాయి. 40 మంది కంటే తక్కువ మంది విద్యార్థులతో పాఠశాలలు కొనసాగడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అటువంటి పాఠశాలలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, విద్యార్థుల వాస్తవ సంఖ్యను పరిశీలించి సమగ్ర నివేదికలు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 60,843 పాఠశాలలు ఉండగా, వాటిలో 84.37 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 3.53 లక్షల మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో 12.9 శాతం పాఠశాలలు పది మంది కంటే తక్కువ మంది విద్యార్థులతో కొనసాగుతుండగా, 500 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలు కేవలం 6.2 శాతం మాత్రమే ఉన్నాయి. రాష్ట్రంలో 58,780 పాఠశాలలకు క్రీడా మైదానాలు అందుబాటులో ఉండగా, 7,364 పాఠశాలల్లో డిజిటల్ గ్రంథాలయ సౌకర్యం ఉంది. మొత్తం పాఠశాలల్లో 44,222 ప్రభుత్వ, 797 ఎయిడెడ్, 15,710 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఉపాధ్యాయుల సంఖ్య పరంగా ప్రభుత్వ పాఠశాలల్లో 2.01 లక్షల మంది, ఎయిడెడ్ పాఠశాలల్లో 3,537 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 1,48,720 మంది పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుడు--విద్యార్థుల నిష్పత్తి ప్రాథమిక స్థాయిలో 1:11, ప్రాథమికోన్నత స్థాయిలో 1:12, మధ్యస్థాయిలో 1:16, ఉన్నత స్థాయిలో 1:15గా నమోదైంది. విద్యార్థుల నమోదు వివరాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో 34.93 లక్షల మంది, ఎయిడెడ్ పాఠశాలల్లో 95,710 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 48.40 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. దాదాపు 45 వేల ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో కలిపి సుమారు 36 లక్షల మంది విద్యార్థులు ఉండగా, కేవలం 15,710 ప్రైవేటు పాఠశాలల్లోనే 48.40 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసించడం ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రతిబింబిస్తోంది.



# విలాసాల ఇంజనీర్..!





**అక్రమార్జనే ధ్యేయంగా అడ్డదారులు..!**
**రూ.28 కోట్ల అక్రమాస్తులపై ఏసీబీ ఉచ్చు**
**రెడ్కో డివిజనల్ ఇంజనీర్ ముత్యం వెంకట రమణపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు**
**భార్య పేరుతో నాలుగు నిర్మాణ సంస్థలు.. రూ.20 కోట్లతో 10 అపార్ట్‌మెంట్ల నిర్మాణం**
**2019లో లంచం కేసులో పట్టుబడిన అధికారిపైనే మరోసారి ఏసీబీ దాడులు**
**ఎనిమిది చోట్ల సోదాలు.. కోట్ల విలువైన భవనాలు, ఫ్లాట్లు, బంగారం, బ్యాంకు నిల్వలు, వాహనాలు స్వాధీనం**

**హైదరాబాద్, జూలై 22 (జై భీమ్ ప్రతినిధి)**

ప్రభుత్వ ఉద్యోగం ప్రజలకు సేవ చేయడానికి ఉద్దేశించబడింది. కానీ కొందరు అధికారులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమార్జననే లక్ష్యంగా పెట్టుకుని కోట్ల రూపాయల ఆస్తులు కూడబెడుతున్నారనే ఆరోపణలు తరచూ వెలుగులోకి వస్తుంటాయి. అలాంటి మరో ఉదంతాన్ని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వెలుగులోకి తీసుకొచ్చింది. ఖైరతాబాద్‌లోని రెడ్కో (రిన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)లో డివిజనల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ముత్యం వెంకట రమణపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి బుధవారం ఏకకాలంలో విస్తృత స్థాయిలో సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో రూ.28 కోట్లకు పైగా విలువైన స్థిర, చరాస్తులు, నిర్మాణ వ్యాపారాలకు సంబంధించిన కీలక ఆధారాలు లభించినట్లు ఏసీబీ వెల్లడించింది. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యం వెంకట రమణ తన చట్టబద్ధమైన ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు అందిన సమాచారంతో కొంతకాలంగా ఆయనపై నిఘా పెట్టారు. ఆయన పేరుతో పాటు కుటుంబ సభ్యులు, బినామీల పేర్లపై ఉన్న ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, వ్యాపార కార్యకలాపాలపై ప్రాథమిక విచారణ చేపట్టారు. విచారణలో లభించిన ఆధారాల మేరకు అవినీతి నిరోధక చట్టం-1988 (2018 సవరణ)లోని సెక్షన్ 13(1)(బి), 13(2) కింద కేసు నమోదు చేసి బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని ఆయన నివాసం, కార్యాలయం, బంధువులు, సన్నిహితులు, బినామీలకు చెందిన మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఒకేసారి సోదాలు చేపట్టారు.

**భారీ స్థిరాస్తుల గుట్టురట్టు**

ఏసీబీ సోదాల్లో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో నాలుగు నివాస ఫ్లాట్లు గుర్తించారు. వీటి ప్రభుత్వ విలువ రూ.1.23 కోట్లుగా నమోదైంది. కూకట్‌పల్లి అంజనేయనగర్‌లో 160 చదరపు గజాల స్థలంలో నిర్మించిన జీ౦3 వాణిజ్య భవనం విలువ రూ.1.82 కోట్లుగా, గుట్టల బేగంపేటలో 250 చదరపు గజాల్లో నిర్మించిన జీ౦5 వాణిజ్య భవనం విలువ రూ.2.90 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ విలువ ప్రకారమే ఈ ఆస్తులు దాదాపు రూ.6 కోట్లకు చేరువలో ఉండగా, మార్కెట్ విలువ మరింత అధికంగా ఉండే అవకాశముందని అధికారులు తెలిపారు.

**భార్య పేరుతో నిర్మాణ సంస్థలు.. కోట్ల పెట్టుబడులు**

దర్యాప్తులో అత్యంత కీలకంగా వెలుగులోకి వచ్చిన అంశం నిర్మాణ రంగంలో చేసిన భారీ పెట్టుబడులు. ముత్యం వెంకట రమణ తన భార్య పేరుతో నాలుగు నిర్మాణ సంస్థలను ఏర్పాటు చేసి వాటి ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు ఏసీబీ గుర్తించింది. మూసాపేట్ అంజనేయనగర్‌లో 10 నివాస అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి సుమారు రూ.20 కోట్ల మేర పెట్టుబడి పెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ సంస్థల ఆర్థిక లావాదేవీలు, పెట్టుబడుల మూలాలు, బినామీల పాత్రపై అధికారులు లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.

**బంగారం.. బ్యాంకు నిల్వలు.. కార్లు.. విలాస జీవనం**

సోదాల్లో రూ.52.02 లక్షల బ్యాంకు డిపాజిట్లు, 2,094 గ్రాముల బంగారు ఆభరణాలు, కియా, మహీంద్రా, బలెనో కార్లు, రూ.30 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు గుర్తించారు. అదనంగా 19 విదేశీ మద్యం సీసాలు, ఒక ఐఎంఎఫ్ఎల్ బాటిల్‌తో మొత్తం 20 మద్యం సీసాలు కూడా లభించాయి. ఈ వ్యవహారంపై మాదాపూర్ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కేసు నమోదు చేసింది.

**గతంలోనూ ఏసీబీ ట్రాప్‌లోనే**

ముత్యం వెంకట రమణ పేరు ఇదే మొదటిసారి కాదు. 2019లో సైబర్ సిటీ సర్కిల్‌లో డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్)గా పనిచేస్తున్న సమయంలో ఓ ఫిర్యాదుదారుడి ఫైల్‌ను ముందుకు పంపేందుకు రూ.25 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ట్రాప్ నిర్వహించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అరెస్టు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఆ కేసు ప్రత్యేక ఏసీబీ కోర్టులో విచారణలో ఉంది. ఆ సమయంలో నిర్వహించిన సోదాల్లో రూ.26.52 లక్షల నగదు, రూ.22.60 లక్షల విలువైన బంగారు ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆ వివరాలను కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు ఏసీబీ వెల్లడించింది.

**రూ.28.14 కోట్ల ఆస్తుల గుర్తింపు**

ప్రస్తుత సోదాల్లో గుర్తించిన స్థిరాస్తులు, బ్యాంకు నిల్వలు, బంగారం, వాహనాలు, గృహోపకరణాలు, నిర్మాణ రంగంలో పెట్టుబడులతో పాటు 2019లో స్వాధీనం చేసుకున్న నగదు, బంగారాన్ని కలిపి మొత్తం ఆస్తుల విలువ రూ.28.14 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. అయితే ఇది ప్రాథమిక అంచనా మాత్రమేనని, ఇంకా ఇతర ప్రాంతాల్లో ఉన్న ఆస్తులు, పెట్టుబడులు, బినామీ లావాదేవీలపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. మార్కెట్ విలువ ప్రకారం ఈ ఆస్తుల విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**ప్రత్యేక కోర్టులో హాజరు.. దర్యాప్తు కొనసాగింపు**

నిందితుడిని హైదరాబాద్‌లోని ప్రత్యేక ఏసీబీ, ఎస్పీఈ కోర్టులో హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్ కోరనున్నట్లు అధికారులు తెలిపారు. అక్రమాస్తుల సంపాదనకు ఉపయోగించిన మార్గాలు, నిర్మాణ సంస్థల ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలు, బినామీ ఆస్తుల వివరాలు, బ్యాంకు ఖాతాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

**లంచం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయండి**

ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేసినా లేదా అవినీతికి సంబంధించిన సమాచారం తెలిసినా ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB), ఎక్స్ (@TelanganaACB) ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

## నీట్ లీక్‌పై రాజకీయాలు తగవు

న్యూఢిల్లీ,జూలై22(జై భీమ్ న్యూస్): నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంటు వేదికగా లోతైన చర్చకు తాము సిద్ధమేనని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. పేపర్ లీక్ అంశం, విద్యార్థుల నిరసనలతో రాజకీయాలు వద్దని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని అన్నారు. విద్యార్థుల డిమాండ్స్, సమస్యలతో రాజకీయం చేసి లాభం పొందేందుకు ప్రయత్నించడం తగదని మంత్రి జేపీ నడ్డా అన్నారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఉదంతాలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించట్లేదని మంత్రి నడ్డా ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని అన్నారు. కేవలం ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లోని అంశాలనే ఎందుకు ఎంచుకుంటున్నారని అన్నారు. 150 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయన్న రాహుల్ గాంధీ ఆరోపణపై కూడా మంత్రి స్పందించారు. ప్రతి కేసుపై దర్యాప్తు చేసేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని అన్నారు.

# నీట్ పరీక్షలపై దేశవ్యాప్తంగా ఆందోళన







### విద్యార్థుల భవిష్యత్తుపై పెరుగుతున్న ప్రశ్నలు

**న్యూఢిల్లీ(జై భీమ్ న్యూస్)**

దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వైద్య ప్రవేశ పరీక్ష అయిన నీట్ నిర్వహణపై గతంలో వెలువడిన పేపర్ లీకేజీ ఆరోపణలు, పరీక్షా వ్యవస్థ పారదర్శకతపై తలెత్తిన సందేహాలు లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళనకు దారితీశాయి. సంవత్సరాల పాటు కష్టపడి సిద్ధమైన విద్యార్థులకు పరీక్ష అనేది కేవలం ఒక అర్హత పరీక్ష మాత్రమే కాదు, వారి భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టం. అలాంటి పరీక్షల విశ్వసనీయత దెబ్బతింటే విద్యార్థుల నమ్మకంతో పాటు దేశ విద్యా వ్యవస్థపై కూడా ప్రభావం పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో లడాఖ్‌కు చెందిన ప్రముఖ విద్యా సంస్కర్త, ఇంజనీర్, ఆవిష్కర్త సోనం వాంగ్చుక్ పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, సమగ్ర విద్యా సంస్కరణలు తీసుకురావాలని కోరుతూ గాంధేయ మార్గంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఆయనకు మద్దతుగా దేశంలోని పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్‌కు చేరుకుని శాంతియుతంగా తమ సంఘీభావాన్ని తెలియజేశారు. నీట్ పరీక్షలపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేలా సంస్కరణలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసన ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు. ముఖ్యంగా విద్యార్థులు తమ భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై ప్రశ్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తిలో భాగమేనని పలువురు పేర్కొంటున్నారు. దేశ భవిష్యత్తును నిర్మించే యువత ఆవేదనను వినడం ప్రభుత్వాల బాధ్యత అని విద్యావేత్తలు, సామాజిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నిరసనల సందర్భంగా చోటుచేసుకున్న పోలీసు చర్యలపై కూడా చర్చ కొనసాగుతోంది. శాంతియుతంగా తమ డిమాండ్లను వినిపిస్తున్న విద్యార్థుల పట్ల సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, చట్టాన్ని అమలు చేయడమే కాకుండా ప్రజాస్వామ్య హక్కులను కూడా గౌరవించాలని పలువురు సూచిస్తున్నారు. నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, బాధ్యులపై చట్టపరమైన చర్యలు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన సంస్కరణలు తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

# పింక్ ప్రీమియర్ లీగ్ 2026 - జెర్సీ ఆవిష్కరణ



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

ఫోర్స్‌జీడబ్ల్యూ వారి ప్రతిష్ఠాత్మక మహిళల క్రికెట్ టోర్నమెంట్ అయిన పింక్ ప్రీమియర్ లీగ్ (పీపీఎల్), జూలై 26, ఆదివారం నాడు జరగాల్సి ఉంది. ఈ టోర్నమెంట్, ఫోర్స్‌జీడబ్ల్యూ మహిళా విభాగమైన నందు మరియు ఎం1 హోమ్స్ (హోస్కోట్‌లోని ఒక విలాసవంతమైన విల్లా కమ్యూనిటీ) సంయుక్తంగా నిర్వహించిన ఒక అద్భుతమైన జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమంతో ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో, మొత్తం 16 అపార్ట్‌మెంట్ జట్ల కెప్టెన్లు మరియు వైస్-కెప్టెన్లు తమ జట్టు జెర్సీలను గర్వంగా ఆవిష్కరించి, వారి నాయకత్వాన్ని ఘనంగా సత్కరించారు. టోర్నమెంట్ మ్యాచ్‌ల షెడ్యూల్ ప్రకటన రాబోయే సీజన్‌పై అంచనాలను మరింత పెంచింది. ఉదయం పూట రుచికరమైన అల్పాహారం మరియు ఉత్సాహభరితమైన సంగీత కార్యక్రమంతో కార్యక్రమం ముగిసింది. ఇది క్రీడాస్ఫూర్తి, జట్టుకృషి మరియు సామూహిక స్ఫూర్తితో పాల్గొనేవారిని ఒకచోట చేర్చింది. ఈ జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమం పింక్ ప్రీమియర్ లీగ్ యొక్క మరో ఉత్సాహభరితమైన వాతావరణాన్ని కల్పించింది.

# ఒట్టి మామిడిపల్లిలో కాంగ్రెస్ నాయకుల జన్మదిన వేడుకలు





**ఐనవోలు(జై భీమ్ న్యూస్)**

ఐనవోలు మండలం, ఒట్టి మామిడిపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గిరిక రాజు జన్మదినాన్ని గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా జరుపుకున్నారు. ఇదే సందర్భంగా ఐనవోలు గ్రామ ముద్దు బిడ్డ దొంతరి సాయి కిరణ్ జన్మదినాన్ని కూడా పురస్కరించుకొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. జన్మదినం సందర్భంగా గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఇద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుర్ర ప్రశాంత్, కుస రవి, హరీష్ సిద్దు,తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు శాఖల సమన్వయం అవసరం

### క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలి
### హనుమకొండ డీఎంహెచ్‌వో డా. ఏ. అప్పయ్య





**పరకాల, 22 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. ఏ. అప్పయ్య సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా బుధవారం ఆయన కో-ఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ డా. వంశీకృష్ణతో కలిసి పరకాల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫీవర్ వార్డును పరిశీలించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గ్రామాల్లో ఇంటింటి ఫీవర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, జ్వర లక్షణాలు ఉన్న వారిని గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స కోసం సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించాలని సూచించారు. మరింత మెరుగైన వైద్య సేవలు అవసరమైన రోగులను వైద్యాధికారుల సూచన మేరకు సామాజిక ఆరోగ్య కేంద్రానికి రెఫర్ చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న పరకాల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పరకాల పీపీపీ యూనిట్ పరిధిలో నిర్వహిస్తున్న ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యాక్సిన్ల నిల్వ విధానం, అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ల వివరాలను అడిగి తెలుసుకుని, వ్యాక్సిన్ నిర్వహణలో నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకును డీసీహెచ్ఎస్ డా. వంశీకృష్ణతో కలిసి పరిశీలించి, నిర్వహణకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డా. నరేష్ కుమార్‌తో పాటు ఆసుపత్రి వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల, కళాశాల బస్సులపై కాజీపేట ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

### ఆదాలత్ సెంటర్‌లో 28 బస్సుల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు

**కాజీపేట, 22 జూలై 2026(జై భీమ్ న్యూస్)**




విద్యార్థుల భద్రతే లక్ష్యంగా కాజీపేట ట్రాఫిక్ పోలీసులు పాఠశాల, కళాశాల బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ (ట్రాఫిక్) రాయల ప్రభాకర్ రావు, ఏసీపీ (ట్రాఫిక్) టి. సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆదాలత్ సెంటర్ వద్ద స్కూల్, కాలేజ్ బస్సుల డ్రైవర్లకు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ (డీడీ) పరీక్షలు చేపట్టారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో మొత్తం 28 పాఠశాల, కళాశాల బస్సులను పరిశీలించారు. విద్యార్థుల ప్రయాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు. పాఠశాల, కళాశాల యాజమాన్యాలు తమ బస్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. విద్యార్థుల ప్రాణాలతో ముడిపడిన అంశంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసిన స్వేరోస్

**జై భీమ్ న్యూస్ పర్వతగిరి జూలై 22**

పర్వతగిరి స్వేరోస్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పర్వతగిరి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 34 మంది ఆర్ఫన్ సెమీ ఆర్ఫన్ విద్యార్థినిలకు నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కస్తూరిబా గాంధీ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా గారు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి గారు పర్వతగిరి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కె నవీన్ కుమార్ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు స్వేరోస్ నెట్వర్క్ మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని అభినందించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసినటువంటి ఒడిస్సా రాష్ట్రంలోని హైజర్ బెర్హంపుర్ యూనివర్సిటీలో బీఎస్ఎంఎస్ లో చదువుతున్న ధరావత్ సౌమ్య స్వేరో విద్యార్థినిలను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండే భవిష్యత్తు లో చదివే కోర్సులపై అవగాహన ఏర్పరచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా స్వేరోస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల ప్రవీణ్ స్వేరో అధికార ప్రతినిధి గారె జయరాజ్ స్వేరో లు మాట్లాడుతూ విద్యార్థినిలు ఉన్నత లక్ష్యాలను పాఠశాల స్థాయి నుండి ఏర్పరచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు పాఠశాల సీ ఆర్ టి లు గూగులోత్ పద్మ గారు, బత్తుల పద్మ గారు, శోభారాణి గారు, ఏ. రాణి గారు, జీ.సునీత గారు వై వి భారతి గారు, దివ్య గారు కేజీబీవి విద్యార్థినిలు పాల్గొన్నారు.



# భూసేకరణపై మరో పిటిషన్ ఎందుకు

అమరావతి,జూలై22(జై భీమ్ న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి భూ సేకరణకు సంబంధించిన ప్రజాహిత వ్యాజ్యం పై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. భూ సేకరణపై అభ్యంతరాలు ఉన్న బాధిత రైతులు ఇప్పటికే కోర్టును ఆశ్రయించినప్పుడు, మరో పిల్ ఎందుకని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. నోరులేని రైతుల తరఫున పిల్ దాఖలు చేశామని పిటిషనర్ తరఫు న్యాయవాది చేసిన వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. భూ సేకరణపై అభ్యంతరాలు వ్యక్తం చేయాల్సింది బాధిత రైతులేనని, పిటిషనర్‌కు ఈ వ్యవహారంతో ఉన్న సంబంధం ఏమిటని ప్రశ్నించింది. నిడమర్రు గ్రామానికి చెందిన జంగా నాగిరెడ్డి దాఖలు చేసిన ఈ పిల్‌పై ఆయన తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. అయితే, కోర్టు రాజకీయ వేదిక కాదని, కోర్టు అధికారిగా నిజాయతీగా విచారణలో కోర్టుకు సహకరించండని సీనియర్ న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. వాక్‌చాతుర్యాన్ని పక్కన పెట్టి వాస్తవాలు, చట్టపరమైన అంశాలపై దృష్టి సారించాలని స్పష్టం చేసింది. పిటిషన్ విచారణార్హతపై పూర్తి స్థాయిలో వాదనలు వినిపించాలని ఆదేశించిన హైకోర్టు, తదుపరి విచారణను వాయిదా వేసింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# వన్ వార్డ్ ఎవ్రీ డే తో సమస్యల పరిష్కారం





**షంషిగూడ, ఆల్విన్ కాలనీ వార్డుల్లో పౌర సమస్యలను సమీక్షించిన సీఎంసీ కమిషనర్**

**జై భీమ్ న్యూస్ కూకట్ పల్లి జూలై 22:-**

వన్ వార్డ్ ఎవ్రీ డే కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్,శేరిలింగంపల్లి శాసనసభ్యులు శ్రీ ఆరెకపూడి గాంధీ తో కలిసి కూకట్‌పల్లి జోన్‌లోని ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని షంషిగూడ వార్డు,ఆల్విన్ కాలనీ వార్డును సందర్శించి పౌర సమస్యలను సమీక్షించారు.కమిషనర్ స్థానిక ప్రజలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆర్ డబ్ల్యూ ఏ ప్రతినిధులతో సమావేశమై వార్డులోని పౌర సమస్యలు, మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు.స్థానికులు మురుగునీటి పారుదల, తాగునీటి సరఫరా, రహదారుల నిర్వహణ, వీధి దీపాల మెరుగుదల, చెత్తను సకాలంలో తరలించడం, పారిశుధ్య సేవల మెరుగుదల వంటి అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.పారిశుధ్య నిర్వహణలో పారదర్శకత కోసం స్ప్రేయింగ్, గ్యాంగ్ స్వీపింగ్ షెడ్యూళ్లను రూపొందించి రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లతో పంచుకోవాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు 450--500 గృహాలకు సేవలందించే సామర్థ్యం కలిగిన కొత్త ఎలక్ట్రిక్ వ్యర్థాల సేకరణ వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.గుర్తించిన అన్ని పౌర సమస్యలను తదుపరి వార్డు సందర్శనకు ముందే పరిష్కరించాలని,ప్రతి ఫిర్యాదుకు నిర్దిష్ట గడువు నిర్ణయించి,పనుల పురోగతిపై స్థానిక ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కమిషనర్ సంబంధిత శాఖలను ఆదేశించారు.వన్ వార్డ్ ఎవ్రీ డే" కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టడం లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు.కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్, సర్కిల్ బృందం సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## SIR కార్యక్రమంలో పాల్గొన్న పట్వారీ శశిధర్



**జై భీమ్ న్యూస్ కూకట్ పల్లి జూలై 22:-**

“ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్” శంషిగూడ డివిజన్ లోని ప్రభుత్వ పాఠశాల నందు SIR కార్యక్రమంశ్రీ “కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు” దర్గుపల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమాన్నికి ముఖ్య అతిథిగా “టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి” వి.జగదీశ్వర్ గౌడ్ మరియు “ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు” పట్వారీ శశిధర్ స్థానిక నాయకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొని సందర్శించి పరిశీలించటం జరిగింది. ఈ సందర్భంగా వి.జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ చేపట్టిన హ×= కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా, “బిఎల్ఓలు” అందజేసే ఎమ్యూనరేషన్ ఫారంలో వారి పూర్తి వివరాలు సక్రమంగా నమోదు చేసుకొని,ఓటు హక్కును పరిరక్షించుకోవటం మన భాద్యత అని తెలిపారు.ఇది మీ ఓటు హక్కును తీసివేయడానికి కాదు,అర్హులైన ప్రతి ఒక్కరి పేరు సరైన వివరాలతో ఓటరు జాబితాలో ఉండేలా చేయడమే దీని ఉద్దేశ్యం అని అన్నారు.”హ×=” కార్యక్రమం లోని ప్రతి ఒక్క “బిఎల్ఓ” వద్ద డివిజన్ లోని ఓటుర్లు ఎంత మంది నమోదు చేసుకున్నారు అనే విషయాలు తెలుసుకొని సమాచారం సేకరించటం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉన్న సేవలు మరియు అవకాశాలను సద్వినియోగ పరుచుకోవటం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కాలనీవాసులు, యువకులు మరియు టీం పట్వారి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై పరకాలలో యూత్ కాంగ్రెస్ నిరసన





**పరకాల, 22 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంతో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి, యువత, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పరకాలలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పరకాల అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మదాసి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్న నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న వారిపై పోలీసుల చర్యలను ఆయన ఖండించారు. అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మదాసి శ్రీధర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులపై పోలీసుల చర్యలను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ప్రతిపక్ష నాయకుల గొంతును అణచివేసే ప్రయత్నాలు సరికాదని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్యామ్, యూత్ కాంగ్రెస్ పరకాల ఉపాధ్యక్షులు శ్రీరామ్, ఉస్మాన్, శ్రవణ్, మండల అధ్యక్షులు తనుగుల సందీప్, నల్ల సుధాకర్, కృష్ణకాంత్, అప్పం కుమారస్వామి, యూత్ కాంగ్రెస్ నాయకులు కొక్కారకొండ కిరణ్, పిట్టల రాజ్‌కుమార్, ఖాసీం, కరీం, షరీఫ్, రాఘవ, వెంకటేష్, నరేష్, ప్రశాంత్, మురళి, శ్రవణ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిరుద్యోగుల బంగారు భవిష్యత్తుకు ‘కేటీఆర్ నిరుద్యోగ భరోసా’ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ యాప్

**కేటీఆర్ 50వ జన్మదినం సందర్భంగా హనుమకొండలో యాప్ ఆవిష్కరణ**

**హన్మకొండ, 22 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకొని నిరుద్యోగ యువతీ యువకుల కోసం రూపొందించిన ‘కేటీఆర్ నిరుద్యోగ భరోసా’ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ యాప్‌ను హనుమకొండలో ఘనంగా ఆవిష్కరించారు. దివ్యాంగుల సహకార సంస్థ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, విద్యార్థి నాయకులు, నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, ఆరూరి రమేష్, మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, నాగుర్ల వెంకన్న, మర్రి యాదవరెడ్డి, నేషనల్ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర తదితరులు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ యాప్‌ను ప్రారంభించారు. వాసుదేవరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత ఈ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ నాయకత్వంలో నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాటాలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తుచేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ పాలనలో పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగ యువతకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ‘కేటీఆర్ నిరుద్యోగ భరోసా’ ఆన్‌లైన్ కోచింగ్ యాప్‌ను సద్వినియోగం చేసుకొని యువత తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం నీళ్లు, నిధులు, నియామకాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కేటీఆర్ కృషితో అనేక ప్రముఖ కంపెనీలు హైదరాబాద్‌తో పాటు టైర్-2 నగరాలకు విస్తరించాయని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ, 2001 నుంచి కేసీఆర్ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేశారని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పించినప్పటికీ వాటిని ప్రచారం చేసుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలతో అధికారంలోకి వచ్చిందని, ప్రస్తుతం యువతకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల నిరుద్యోగ యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. పోటీ పరీక్షల నిర్వహణలో జరుగుతున్న పరిణామాలపై యువత ఆందోళన చెందుతోందన్నారు. రాష్ట్రంలో సాగునీటి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, వ్యవసాయ రంగానికి అవసరమైన నీటిని అందించకపోతే రైతుల పక్షాన పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగ నియామకాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. యువత సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని, నిరుద్యోగులకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమం కళాకారుల ఆటపాటలతో ఉత్సాహభరితంగా సాగింది. పెద్ద సంఖ్యలో యువతీ యువకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు హాజరుకావడంతో ఫంక్షన్ హాల్ కిటకిటలాడింది. కేటీఆర్ రాజకీయ, ఉద్యమ ప్రస్థానాన్ని వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక ఏవీని ప్రదర్శించారు. ఏవీని వీక్షించిన పలువురు భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం కేటీఆర్ 50వ జన్మదినానికి గుర్తుగా అతిథుల సమక్షంలో 50 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి ఆయనకు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను వాసుదేవరెడ్డి పూలబొకేలు అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, విద్యార్థి ఉద్యమకారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువతీ యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి దాశరథి ప్రతీక: డా. మామిడి లింగయ్య



**హన్మకొండ, 22 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో మహాకవి, తెలంగాణ విమోచనోద్యమ యోధుడు దాశరథి కృష్ణమాచార్య 101వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగాధ్యక్షుడు డా. మామిడి లింగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. మామిడి లింగయ్య మాట్లాడుతూ దాశరథి కేవలం కవి మాత్రమే కాకుండా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచారని అన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, ఆత్మగౌరవాన్ని తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన మహనీయుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. దాశరథి సాహిత్యంలో దేశభక్తి, మానవతా విలువలు, సామాజిక సమానత్వం స్పష్టంగా ప్రతిఫలిస్తాయని వివరించారు. అనంతరం దాశరథి సాహిత్య విశిష్టత, తెలంగాణ విమోచనోద్యమంలో ఆయన పోషించిన పాత్రతో పాటు ఆధునిక సమాజంలో ఆయన ఆలోచనల ప్రాసంగికతపై అధ్యాపకులు, విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. దాశరథి రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, పాలక మండలి సభ్యుడు చిర్ర రాజు, డా. కర్రే సదాశివ్, అన్నపూర్ణ, డా. బానోత్ స్వామి, పీజీ విద్యార్థులు తదితరులు పాల్గొని దాశరథి సాహిత్య వారసత్వాన్ని స్మరించుకున్నారు.

## వరంగల్ పశ్చిమకు భట్టి వరం..

**హనుమకొండ, 22 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి, బాలసముద్రం మరియు కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) వద్ద రెండు 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఈ సబ్‌స్టేషన్లతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. లోడ్ సామర్థ్యం పెరగడంతో పాటు గృహాలు, వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు వీలు కలుగుతుంది. భవిష్యత్తులో కనీసం 10 నుంచి 15 సంవత్సరాల వరకు విద్యుత్ లోడ్ సమస్యలు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, సరఫరా అంతరాయాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రత కార్డుల అమలుపై రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్య భద్రత కార్డుల అమలుతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, ఉద్యోగుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు ఇది నిదర్శనమని సంఘం నాయకులు పేర్కొన్నారు. అనంతరం టీఎన్‌జీఓఎస్ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, టీఎన్‌జీఓఎస్ నాయకులు పాల్గొన్నారు.